క్లుప్తంగా

న్యాయం జరిగేలా చూస్తాం



వినతి పత్రం అందిస్తున్న బాధితులు

మిరుదొడ్డి(దుబ్బాక): గురుకుల విద్యార్థి వివేక్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య భరోసా ఇచ్చారు. హుస్నాబాద్ జిల్లెల గడ్డ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థి పానాదుల వివేక్ ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు దళిత సంఘాల నేతలతో కలిసి వెంకటయ్యకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి సత్వరం న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానన్నారు. జాతీయ మాల మహానాడు పొలిట్ బ్యూరో చైర్మన్ శ్రీరాములు, నాయకులు నర్సింగరావు, రమేశ్, కనకయ్య, రాములు, సన్ని, రాకేశ్, నాని, మాధవ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించండి: ఎమ్మెల్యే



కిషన్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): మండలంలోని ఘనపూర్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కొమ్ము కిషన్‌కు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వైద్యులకు సూచించారు. ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిషన్‌ను ఎమ్మెల్యే శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సీఈఓ శ్రీనివాస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కిషన్‌కు అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నిర్వీర్యం చేయొద్దు



మాట్లాడుతున్న ఆదిత్య

హుస్నాబాద్: విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయొద్దని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య డిమాండ్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ బాలికలు, బాలుర జూనియర్ కళాశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. కళాశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయని, మరమ్మతులు చేయించాలని కోరారు. వాన కురిస్తే మోడల్ స్కూల్ ఆవరణ బురదమయంగా మారుతోందని, అలాగే అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అక్కన్నపేటలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. చరణ్, రాహుల్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.2 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గోనెపల్లిలో నిర్మిస్తున్న సీతారామాంజనేయ ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన వంగాల రంగయ్య, ఆయన కుమారులు శనివారం రూ.2,00,116 విరాళంగా అందజేశారు. దీంతో రంగయ్యను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. ఆలయ నిర్మాణానికి మరింత మంది దాతలు ముందుకు రావాలని కోరారు.

అందుబాటులో విత్తనాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): జాతీయ ఆహార భద్రత పోషణ మిషన్(ఎన్ఎఫ్ఎస్ఎన్ఎం) పథకంలో భాగంగా యాసంగి సీజన్ కోసం జిల్లా వ్యవసాయశాఖ మొక్కజొన్న విత్తనాలను రాయితీపై అందజేస్తుందని మండల వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ విత్తన సంస్థ ద్వారా విడుదలైన ఎన్ఎస్‌సీ సీటీ 4260 రకమైన నాలుగు కిలోల బ్యాగ్ రూ.980కే పొందవచ్చని, ఆయా గ్రామాల క్లస్టర్ల పరిధిలోని ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.

నిర్లక్ష్యం.. అలసత్వం

ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వంతో పంచాయతీ భవన నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించడంలో ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అసంపూర్తిగా పంచాయతీ భవనాలు

- నిధుల కోసం కృషి చేయని నేతలు
- ఏళ్లు గడిచినా పూర్తికాని నిర్మాణాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



అసంపూర్తిగా బంజేరుపల్లి పంచాయతీ భవనం



పిల్లర్ల స్థాయిలో రాంపురం పంచాయతీ భవనం

తొగుట(దుబ్బాక): మండలంలోని బంజేరుపల్లి, రాంపురం పంచాయతీలకు సొంత భవనాలు లేవు. అప్పటి దొమ్మాట ఎమ్మెల్యే చెరుకు ముత్యం రెడ్డి కృషితో 2003లో తొగుట 17 పంచాయతీలతో ప్రత్యేక మండలంగా ఏర్పాటైంది. అదే సమయంలో బంజేరుపల్లి, రాంపురం, లక్ష్మాపురం, బి.బంజేరుపల్లి, వర్దరాజులపల్లి గ్రామాలను ప్రత్యేక పంచాయతీలుగా ఆయన ఏర్పాటు చేయించారు. దీంతో మండలంలోని పంచాయతీల సంఖ్య 22కు చేరింది.

భవనాలకు నిధులు

తర్వాత ఐదు పంచాయతీలు భవనాలు నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం రూ.14 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. లక్ష్మాపూర్, బి.బంజేరుపల్లి, రాంపురం మూడు గ్రామాలు కొమురవెల్లి మల్లన్నసాగర్ ముంపునకు గురయ్యాయి. లక్ష్మాపూర్, బి.బంజేరుపల్లి గ్రామాల ప్రజలు గజ్వేల్ ఆర్ అండ్‌ఆర్ కాలనీకి తరలి వెళ్లారు. రాంపురం గ్రామస్తులు మాత్రం అక్కడే ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారు. రాంపురం ఆర్అండ్‌ఆర్ కాలనీకి వెళ్తారన్న ఉద్దేశ్యంతో పంచాయతీకి మంజూరైన నిధులను ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో భవనం పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయింది.

ముందుకు సాగని పనులు

బంజేరుపల్లి పంచాయతీ భవన నిర్మాణ పనులు మాత్రం పదేళ్లుగా ముందుకు సాగని దుస్థితి నెలకొంది. కాంట్రాక్టర్ పనులు చేపట్టి స్లాబ్‌వేసి గోడలు నిర్మించి వదిలేశాడు. అప్పటి నుంచి అధికారులు, ప్రజా ప్రతినిధులు పంచాయతీ భవన నిర్మాణం పూర్తిచేయడానికి నిధుల మంజూరు కోసం కృషి చేయలేదన్న విమర్శలున్నాయి.

ప్రజలకు తప్పని తిప్పలు

పంచాయతీ భవనాలు లేక ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతే కాదు పంచాయతీ పాలకవర్గంతో పాటు అధికారులకు కూడా తిప్పలు తప్పడంలేదు. అద్దె భవనాలలో పంచాయతీ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రభుత్వమైనా రాంపురం, బంజేరుపల్లి పంచాయతీ భవనాల నిర్మానానికి నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిధుల కోసం ప్రయత్నించా..



బంజేరుపల్లి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటైన తర్వాత రెండో సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించాను. ఆ సమయంలో నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశాను. అధికారులు సహకరించలేదు. దీంతో పంచాయతీ భవనం నిర్మాణం అసంపూర్తిగానే నిలిచిపోయింది. ప్రస్తుత ప్రభుత్వమైనా నిధులు మంజూరు చేయాలని కోరుతున్నా. – రాజొండ మంజుల, మాజీ సర్పంచ్, బంజేరుపల్లి

ప్రతిపాదనలు పంపిస్తా..

బంజురుపల్లి, రాంపురం పంచాయతీ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయిన విషయం నా దృష్టికి వచ్చింది. ఇటీవలే పంచాయతీ రాజ్ విభాగం మండల ఏఈగా బాధ్యతలు చేపట్టాను. నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపిస్తాం. ప్రభుత్వం మంజూరు చేయగానే నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. – ఇర్ఫాన్, ఏఈ పంచాయతీరాజ్ విభాగం

కార్మికులకు అందని కనీస వేతనం

- రూ.26 వేలు చెల్లించాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి



జెండా విష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

సిద్దిపేటఅర్బన్: మున్సిపాలిటీలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనం అమలు కావడం లేదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కార్మిక, కర్షక భవన్‌లో శనివారం సీఐటీయూ అనుబంధ సంస్థలైన జిల్లా మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ల 4వ మహాసభ నిర్వహించారు. సభలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అలాగే రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఎన్నో వాగ్దానాలు చేసి విస్మరిస్తోందని విమర్శించారు. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛ తెలంగాణగా మార్చిన మున్సిపల్ కార్మికుల ఆరోగ్యాల బాగుకోసం ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారుర. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడిగా గోపాలస్వామి, అధ్యక్షుడిగా నర్సింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సతీశ్, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, కోశాధికారిగా వినోద, ఉపాధ్యక్షులుగా రాజయ్య, మహేశ్, కనకలక్ష్మి, రవి, దుర్గ, సహాయ కార్యదర్శులుగా సత్యం, రాజయ్య, విజయలక్ష్మి, నర్సింహులు, కమిటీ సభ్యులుగా కవిత, లత, బాలవ్వ, ప్రశాంత్, రాజేశ్వరి, యాదమ్మ, సురేశ్ తదితరులు ఎంపికయ్యారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పల్లా

జనగామ ఎమ్మెల్యే పల్లా

మద్దూరు(హుస్నాబాద్): ప్రజలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీకి రానున్న స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని మర్మాముల గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత ఆధ్వర్యంలో శనివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెవేర్చడం లేదన్నారు. స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా అత్యధిక స్థానాలు గెలించేలా ప్రతి ఒక్కరు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుందరగిరి పరశురాములు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులకు పరిహారం ఎక్కడ?

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



పత్తి పంట పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి తదితరులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): సకాలంలో యూరియా అందక పోవడం, అకాల వర్షాలతో పత్తి రైతులకు పెట్టుబడి కూడా లభించని పరిస్థితి నెలకొందని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వారిక నష్టపరిహారం చెల్లించాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని అలిరాజీపేటలో శనివారం పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలకు నష్టం జరిగిందన్నారు. ఎకరానికి కనీసం ఐదు క్వింటాళ్ల పత్తి దిగుబడి రాని పరిస్థితి ఉందని చెప్పారు. పత్తి రైతులకు ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే వెంటనే సీసీఐ కేంద్రాలను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ భూమయ్య, మాజీ ఎంపీపీ బాలేషంగౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కవితారెడ్డి, కిరణ్, చంద్రశేఖర్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఖాళీలు భర్తీ చేయండి

- అర్హులైన ఆయాలకు ప్రమోషన్లు ఇవ్వాలి
- అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పద్మ



సమావేశంలో మాట్లాడుతున్న పద్మ

సిద్దిపేటఅర్బన్: అంగన్‌వాడీల్లో ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయాల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.పద్మ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కమిటీ సమావేశం సిద్దిపేటలోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా టీచర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.2 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీ విద్యను అంగన్‌వాడీలలోనే కొనసాగించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలపై సర్వేలు, ఇతర విధుల పేరిట పని భారం పెరిగిపోతోందని, పని భారం తగ్గించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. మెనూ ఛార్జీలు పెంచాలని, సెంటర్‌కు రెండు సిలిండర్లు ఇవ్వాలని అన్నారు. జిల్లాలోని ఆయాలకు ప్రమోషన్ ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి. పద్మ, కోశాధికారి లక్ష్మి, సభ్యులు భూలక్ష్మి, మల్లేశ్వరి, సురేఖ, కళావతి, బాలవ్వ, సత్యలక్ష్మి, లక్ష్మి, యశోద, శాంత, వసంత, ఆండాలు, వరవ్వ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి చలనం లేదు



నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, మొక్కజొన్న రైతులు

బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత వేణుగోపాల్ రెడ్డి

సిద్దిపేటజోన్: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వానికి చలనం లేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వేణుగోపాల్ రెడ్డి విమర్శించారు. శనివారం పత్తి మార్కెట్ యార్డులో మక్క రైతులకు మద్దతుగా నిరసన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ రాసినప్పటికీ ప్రభుత్వ నుంచి స్పందన కరువైందన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు రైతులను మోసం చేస్తున్నారని వాపోయారు. గతంలో ముందస్తు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూశామని గుర్తుచేశారు. మరో రెండు రోజుల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భారతి సిమెంట్‌తో నిర్మాణం వేగవంతం



కాంట్రాక్టర్లకు ప్రోత్సాహకాలు అందిస్తున్న సునీల్

ఎస్టేట్ టెక్నికల్ మేనేజర్ సునీల్

మిరుదొడ్డి(దుబ్బాక): సిమెంట్ వ్యాపారరంగంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న వికాట్ గ్రూప్‌నకు చెందిన భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ మరింత వేగవంతమవుతుందని ఎస్టేట్ టెక్నికల్ మేనేజర్ కె.సునీల్ తెలిపారు. మిరుదొడ్డిలోని మణికంఠ ట్రేడర్స్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కాంట్రాక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్ట్రాఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ నిర్మాణాలపై కాంట్రాక్టర్లకు అవగాహన కలిగిస్తూ ప్రోత్సాహకాలు అందించారు. భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్‌సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో కూడా విడుదల చేసిందన్నారు. భారతి సిమెంట్‌తో నిర్మాణ దృఢత్వం ఎక్కువగా ఉంటుందని, స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు ఇది సరైన ఎంపిక అని చెప్పారు. సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని తెలిపారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన ఇంజనీర్లు సైట్‌కే వచ్చి సహాయ పడతారని, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో రూరల్ బ్రాంచ్ మేనేజర్ వి.నాగేశ్వర్ రావు, మార్కెటింగ్ టీం ఆఫీసర్లు గంగాధర్, తిరుపతి, టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ అజయ్‌రెడ్డి, మణికంఠ డీలర్ మహేందర్, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

టెట్ నిబంధనతో ఉపాధ్యాయుల్లో ఆందోళన

టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రతినిధి తిరుపతిరెడ్డి



మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ ఉపాధ్యాయులు టెట్‌లో ఉత్తీర్ణత సాధించాలనే నిబంధనతో వారిలో ఆందోళన నెలకొందని టీపీటీఎఫ్ అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సిద్దిపేట అర్బన్ మండలశాఖ సర్వసభ్య సమావేశం ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు పదోన్నతిపై వెళ్లడం మూలంగా ఖాళీలు ఏర్పడ్డాయని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వెంటనే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్నారు. అర్బన్ మండలంలోని కేసీఆర్ నగర్ ఉన్నత, ప్రాథమిక, ఉర్దూ మీడియం పాఠశాలల్లో వసతులు సరిగా లేక, తరగతి గదులు సరిపోక విద్యార్థులు నష్టపోతున్నారని వాపోయారు. విద్యాశాఖ వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం మండలశాఖ ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిలర్ తిరుపతి, జిల్లా కౌన్సిలర్ విష్ణువర్ధన్, మల్లేశం, శ్రీనివాస్, రాజు, సుధాకర్‌రావు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



సమ్మెకు మద్దతు తెలుపుతున్న మల్లికార్జున్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని మీర్జాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో డైలీవైజ్ వర్కర్స్ చేపట్టిన సమ్మెకు బీఆర్‌ఎస్ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి శనివారం సంఘీభావం తెలిపారు. కార్మికులతో మాట్లాడి వారి సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల వేతనాలను పెంచడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. వేతనాలు సక్రమంగా చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో దీనస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం స్పందించి సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు.

దళారులకు అమ్మొద్దు

కోహెడ(హుస్నాబాద్): పత్తి రైతుల కోసం ప్రభుత్వం సీసీఐ ద్వారా క్వింటాలుకు రూ.8,110 మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయనుందని, రైతులు దళారులకు విక్రయించి మోసపోవద్దని ఏఎంసీ చైర్మన్ బొయిని నిర్మల సూచించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. హుస్నాబాద్ మార్కెట్‌లో త్వరలో పత్తి కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం: ఏసీపీ శ్రీనివాస్



సిద్దిపేటకమాన్: మ్యాట్రిమోనియల్ సైట్స్ ద్వారా సైబర్ మోసాలు జరుగుతున్నాయని, వాటితో అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు ఎన్ఆర్ఐ, వ్యాపారస్తుల పేరుతో మ్యాట్రిమోనియల్ సైట్స్ ద్వారా సోషల్ మీడియాలో పరిచయం చేసుకుని వివాహ వాగ్దానాలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అధిక లాభాలను ఆశ చూపడం, పెట్టుబడుల పేరుతో ఆన్‌లైన్‌లో డబ్బులు కొల్లగొడుతున్నారని చెప్పారు. ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు కుట్ర

కొముురవెల్లి(సిద్దిపేట): రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పెంపును అడ్డుకునేందుకు అగ్రకులాలు కుట్ర చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 60 శాతం మంది బీసీలు ఉంటే ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు ఇస్తే అగ్రకులాలు ఓర్వలేక కోర్టుకు పోయి బీసీల పొట్టకొడుతున్నారన్నారు. గతంలో అగ్రకులాల కోసం తీసుకు వచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను ఎవరూ అడ్డుకోలేదని గుర్తు చేశారు. బీసీలలో ఎక్కువ శాతం పేదలు ఉన్నారని వారిని ఆదుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ తీసుకువచ్చిందన్నారు. బీసీలంతా ఐక్యంగా ఉద్య మించాలని పిలుపునిచ్చారు.

వీడియో కాన్ఫరెన్స్ వీక్షణ



కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న జిల్లా అధికారులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడలో రైతువేదికలో ప్రధాన మంత్రి ధన్‌-ధ్యాన్ కృషి యోజన పథకంపై ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా ఢిల్లీ నుంచి మోదీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా వ్యవసాయాధికారి స్వరూప రాణి ఆధ్వర్యంలో అధికారులు వీక్షించారు. పప్పు దినుసుల సాగు ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని రైతులకు సూచించారు. పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖకు సంబంధించిన పలు పథకాలను ప్రధాని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కొండల్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారి కౌలస్య, ఆయిల్ ఫెడ్ జిల్లా అధికారి భాస్కర్ రెడ్డి, మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• రాజ్యాంగాన్ని అవమానపరిచినట్టే..

చేర్యాల(సిద్దిపేట): సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై జరిగిన దాడి రాజ్యాంగాన్ని అవమానపరిచినట్టేనని ఎమ్మార్పీఎస్ డివిజన్ ఇన్‌చార్జి సనవాల ప్రసాద్ అన్నారు. పట్టణ కేంద్రంలో అఖిల పక్ష నాయకులు అందె అశోక్, కొంగరి వెంకట్‌మావోతో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడారు. భూమయ్య, సుదర్శన్, హరికృష్ణ, ఐలయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

• మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి కొన్ని రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఇరవై మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.15,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

• ఒకరి అరెస్టు

బెజ్జంకి(సిద్దిపేట): తోటపల్లి శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలించి విక్రయిస్తున్న నాంపెల్లి శంకర్‌ను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సౌజన్య తెలిపారు. ఎటువంటి అనుమతి లేకుండా వాగు నుంచి ఆరు ట్రాక్టర్‌ల ఇసుకను తరలించి బతుకమ్మ ఘాట్ వద్ద రహస్యంగా డంపు చేశాడని గుర్తించి ఇసుకను సీజ్ చేశామని చెప్పారు.

• ప్రజల సహకారం అవసరం

హుస్నాబాద్: గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాలను అరికట్టడంలో ప్రజల సహకారం అవసరమని ఎస్ఐ లక్ష్మారెడ్డి అన్నారు. నార్కోటిక్ డాగ్స్‌తో శనివారం పట్టణంలోని దాబాలు, కిరాణ దుకాణాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు.

• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ వన్‌టౌన్ పీఎస్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంచరీ బజార్, బురుజు, సుబాష్‌రోడ్డు, పాత బస్టాండ్, మోహినీపుర, వన్‌టౌన్ పీఎస్, గాంధీరోడ్డు, మంగమ్మతోట, శర్వదాన్, నాసర్‌పుర, పాత మార్కెట్ ప్రాంతాలలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

• శతక సాహిత్యం చేసిన మేలు అజరామరం

కొండపాక(గజ్వేల్): తెలుగులో శతక సాహిత్యం సమాజ నిర్మాణానికి చేసిన మేలు అజరామరమని అవధాన విద్యా వికాస పరిషత్ అధ్యక్షుడు మరుమాముల దత్తాత్రేయ శర్మ అన్నారు. మండల పరిధిలని మర్పడ్గ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో విజయదుర్గ మాత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సంగీతం నర్సింహారావు రచించిన నరసింహ శతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ట్రస్టు వ్యవస్థాపకుడు చెప్పెల హరినాథ శర్మ మాట్లాడారు. సరస్వతీ రామవర్మ అధ్యక్షతన నిర్వహించిన కవి సమ్మేళనంలో 50 మంది కవితాగానం చేశారు. గౌరీ శంకర శర్మ, కేవీఎస్ ఆచార్య, పండరి రాధాకృష్ణ, అయిత బాల్‌రాజేశం, అష్టావధాని గౌరీ శంకర్, శైలజ, ఉస్మాన్, శివప్రసాద్, వేలేటి మృత్యుంజయశర్మ పాల్గొన్నారు.

• ఎల్లం మృతికి సంతాపం

బెజ్జంకి(సిద్దిపేట): బీజేపీ నాయకుడు గంగుల ఎల్లం బెజ్జంకిలో గుండెపోటుతో మృతి చెందడంపై నాయకులు సంతాపం తెలిపారు. శనివారం నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొని మృతదేహానికి కాషాయ జెండా కప్పి నివాళులర్పించారు. రూ.5 వేలు సహాయం అందజేశారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజు, పాల్గొన్నారు.